

డీసీసీబీ చైర్మన్ పదవికి కోలా గురువులు రాజీనామా

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవికి వైసీపీ నేత కోలా గురువులు శుక్రవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్టు సహకార శాఖ కమిషనర్/రిజిస్ట్రార్‌కు పంపిన లేఖలో పేర్కొన్నారు. చైర్మన్ పదవిలో కొనసాగేందుకు వచ్చే నెల 17వ తేదీ వరకు గడువు ఉంది. అయితే వైసీపీ ఓటమి నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారంతా తమ పదవులకు రాజీనామా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు. కాగా విశాఖ డీసీసీబీ పాలకవర్గంలో పర్సన్‌లు(డైరెక్టర్లు)గా ఉన్న ఇద్దరు ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు.

ఉత్సవాలను జయప్రదం చేయాలి

- మోదకొండమ్మ ఉత్సవ కమిటీ సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత
- భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.విజయసునీత, పక్కన ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 9, 10, 11 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న మోదకొండమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. అమ్మవారి ఘటాలు శతకంపట్టుకు తరలింపు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, ప్రజా రవాణా సౌకర్యాలు, విద్యుత్, భోజన ఏర్పాట్లు, వైద్య సేవలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేసి సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా క్లోరినేషన్ చేసిన తాగునీటిని మాత్రమే సరఫరా చేయాలని, వంట గ్యాస్ సమస్య లేకుండా వినియోగదారులకు సరఫరా చేయాలన్నారు. అదనపు సిబ్బందిని నియమించి పట్టణంలో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు అనువుగా తగినన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

భారీ వాహన రాకపోకలపై నిషేధం

ఉత్సవాల సందర్భంగా స్థానిక ఘాట్‌రోడ్డులో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధిస్తున్నామని జిల్లా కలెక్టర్ విజయసునీత పేర్కొన్నారు. నాలుగైదు రోజులు భారీ వాహనాలను అనుమతించవద్దని పోలీసు, రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రైవేటు వాహనాలు పరిమితికి మించి ప్రయాణికుల రవాణా చేయకుండా చర్యలు చేపట్టాలని ఆర్టీవో అధికారులకు సూచించారు.

ఉత్సవాలకు భారీ భద్రత : ఎస్పీ

ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 750 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సమావేశంలో వివరించారు. మోదకొండమ్మ ఆలయం, శతకంపట్టు, సినిమాహాలు సెంటర్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

మూడు ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్

ఉత్సావాలకు పాడేరు వచ్చే భక్తుల వాహనాలకు మూడు ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఏఎస్పీ కె.ధీరజ్ తెలిపారు. విశాపట్నం నుంచి వచ్చే వాహనాలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, చింతపల్లి మార్గం నుంచి వచ్చే వాహనాలకు స్థానిక సెయింట్ ఆన్స్ స్కూలు సమీపంలో, అరకులోయ, ముంచంగిపుట్టు మార్గాల నుంచి వచ్చే వాహనాలకు తలారిసింగి ఆశ్రమ పాఠశాల సమీపంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌వో బి.పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం. రాజు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శులు టి.ప్రసాదనాయుడు, వై.శ్రీను, కె.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పాలిహౌస్‌పై నిర్లక్ష్యపు నీడ!

శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు

- గణనీయంగా పడిపోయిన మిరియాల మొక్కల ఉత్పత్తి
- భవిష్యత్తులో మేలి రకం మొక్కల పంపిణీ కష్టమే



శిథిలావస్థకు చేరిన హెచ్‌ఎన్‌టీసీ పాలిహౌస్

చింతపల్లి, జూన్ 7: **ఉద్యాన క్షేత్రం, శిక్షణ కేంద్రం (హెచ్‌ఎన్‌టీసీ)లో మేలిజాతి రకాల మిరియాల మొక్కల ఉత్పత్తి కోసం నిర్మించిన పాలిహౌస్ శిథిలావస్థకు చేరుకున్నది. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. దీనివల్ల మిరియాల మొక్కల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది.**

జిల్లాలో ఆదివాసీలు కాఫీ తరహాలో మిరియాల సాగు చేపడుతున్నారు. కాఫీ తోటల్లో మిరియాలను అంతర పంటగా సాగుచేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. మిరియాలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో గరిష్ఠ ధర లభిస్తున్నది. ప్రస్తుతం ఆదివాసీలు సాగు చేస్తున్న మిరియాల మొక్కల నుంచి ఆశించిన దిగుబడి రావడం లేదు. దీంతో ఆదివాసీ రైతులకు మేలిరకం మిరియాలను అందజేయాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం 2018లో కేరళ కాలికట్ సుగంధ ద్రవ్య పంట బోర్డు అభివృద్ధి చేసిన ఏడు రకాల మేలి రకం మొక్కలను దిగుమతి చేసుకుంది. ఈ మొక్కలు తెగుళ్లను తట్టుకోవడంతో పాటు ఒక్కొక్క మొక్క నుంచి 3-4 కిలోల దిగుబడినిస్తుంది. స్పైస్ బోర్డు నుంచి గిరిముండ, శక్తి, శ్రీకర, పంచమి, పౌర్ణమి, మలబార్ ఎక్సెల్, సుబ్కర రకాల మొక్కలను చింతపల్లి ఉద్యాన క్షేత్రం, శిక్షణ కేంద్రానికి దిగుమతి చేసుకున్నారు. ఈ ఏడు రకాల మొక్కలను చింతపల్లి ఉద్యాన క్షేత్రం, శిక్షణ కేంద్రంలో షేడ్‌నెట్ నర్సరీ ద్వారా అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.ఐదు లక్షల నిధులు వెచ్చించి ఐటీడీఏ అదే ఏడాది పాలిహౌస్‌ను నిర్మించింది. ఈ పాలిహౌస్‌లో ఉత్పత్తి చేసిన నూతన రకాల మొక్కలను ప్రతి ఏటా ఐటీడీఏ 1.3 లక్షల నుంచి 1.6 లక్షల మొక్కలను రైతులకు నామమాత్రపు ధరకు అందజేస్తున్నది. ప్రతి ఏడాది పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధి 11 మండలాల ఆదివాసీ రైతులకు అవసరమైన రెండు లక్షల మొక్కలను ఐటీడీఏ పంపిణీ చేస్తున్నది.



పాలిహౌస్‌లో నీడ కలిగిన తక్కువ విస్తీర్ణంలో ఉత్పత్తి చేస్తున్న మిరియాల మొక్కలు

పడిపోయిన మొక్కల ఉత్పత్తి

హెచ్‌ఎన్‌టీసీలో పాలిహౌస్ శిథిలావస్థకు చేరుకోవడం వల్ల మిరియా మొక్కల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. మిరియాల మొక్కల అభివృద్ధికి తగినంత నీడ ఉండాలి. సాధారణ వాతావరణం కంటే 10 డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రత ఉండాలి. తొలి రోజుల్లో పాలిహౌస్ మొక్కల ఉత్పత్తికి అనువుగా ఉండేది. గత రెండేళ్లుగా పాలిహౌస్ పైకప్పు చిరిగిపోతూ రంధ్రాలు ఏర్పడ్డాయి. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల ప్రస్తుతం పైకప్పు పూర్తిగా శిథిలమైపోయింది. ప్రస్తుతం మొక్కలపై నేరుగా ఎండ పడుతున్నది. మొక్కలపై పగటి ఉష్ణోగ్రతల ప్రభాగం అధికంగా ఉంది. ఈ కారణంగా పాలిహౌస్‌లో 70 శాతం మొక్కల ఉత్పిత్తి పడిపోయింది. పాలిహౌస్‌లో పైకప్పు కలిగిన 25 శాతం భాగంలోనే మొక్కలను అభివృద్ధి చేస్తున్నారు. తాజా పరిస్థితుల్లో పాలిహౌస్‌కు మరమ్మతులు చేపట్టకపోతే మిరియాల మొక్కల ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం లేకపోలేదు. మొక్కల ఉత్పత్తి నిలిచిపోవడంతో పాటు విత్తన మొక్కలు(మదర్ ప్లాంట్) సైతం చనిపోయే అవకాశం ఉంది.

ప్రతిపాదనలకే పరిమితం

హెచ్‌ఎన్‌టీసీలో మరమ్మతులకు గురైన పాలిహౌస్‌ను బాగు చేసేందుకు గత ఏడాది ఐటీడీఏ ఉద్యానశాఖ ... మిగతా 8వ పేజీలో

పనస కాయలతో విలువ ఆధారిత ఉప ఉత్పత్తులు

గిరిజన మహిళలకు శిక్షణ

- కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్యసుధ





పనస ఉప ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్న కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధ

చింతపల్లి, జూన్ 7: పనస కాయలతో విలువ ఆధారిత ఉప ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం లభిస్తుందని హరిపురం కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి.దివ్య సుధ అన్నారు. శుక్రవారం లంబసింగి రైతు ఉత్పత్తిదారుల సంఘం పరిధిలోని మహిళలకు పనసకాయతో విలువ ఆధారిత ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మేలుజాతి పనస ఉత్పత్తులు సీజన్‌లో లభిస్తాయన్నారు. ఆదివాసీ రైతులు పనస పండ్లను నేరుగా మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారని, కొనుగోలు దారులులేకపోతే పశువులకు ఆహారంగా వేస్తున్నారన్నారు. మరికొంత మంది కంపోస్టు ఎరువుగా ఉపయోగిస్తున్నారన్నారు. దీంతో గిరిజన రైతులు గరిష్ఠ ధర పొందలేకపోతున్నారన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందిన తాజంగి గ్రామానికి చెందిన దేశగిరి బంగారమ్మ పనసతో పలురకాల ఉత్పత్తులు తయారు చేసి వారపు సంతల్లో విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నదన్నారు. పనసలో మెండైన పోషక విలువలు ఉన్నాయన్నారు. విటమిన్లు, పీచు పదార్థం, ఖనిజ లవణాలు ఉన్నాయన్నారు. దీంతో పనస ఉప ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నదన్నారు. గిరిజన మహిళలు కొద్దిపాటి మెలకువలు పాటిస్తే పనసకాయతో పచ్చడి, చిప్స్, పనస జ్యూస్, జామ్‌తోపాటూ పలు రకాల ఉత్పత్తులు తయారు చేసుకోవచ్చునన్నారు. ఈ ఉత్పత్తులను తయారు చేసే విధానాన్ని ఆమె స్వయంగా గిరిజన మహిళలకు శిక్షణ ఇచ్చారు. రానున్న రోజుల్లో పనస ఉప ఉత్పత్తులు తయారు చేసి మహిళలు అదనపు ఆదాయం పొందేలా కృషి చేస్తామని వివరించారు.

మన్యంలో చల్లని వాతావరణం

తగ్గుముఖం పట్టిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

- ముంచంగిపుట్టు, పెదబయలులో భారీ వర్షం
- నైరుతి రుతుపవనాల ప్రభావమే కారణం



ముంచంగిపుట్టులో వర్షం కురుస్తున్న దృశ్యం

పాడేరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో మన్యంలో తరచూ వర్షాలు కురుస్తుండడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గతవారం వరకు ఏజెన్సీలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీలు వరకు నమోదయ్యేవి. కానీ శుక్రవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సియస్‌కు మించలేదు. గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడం, రోహిణి కార్తెలు ముగియడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ఎండలు కాస్తున్నప్పటికీ తీవ్రత తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం పాడేరులో 33, అరకులోయలో 32.8, చింతపల్లిలో 31.5, ముంచంగిపుట్టులో 31.5, హుకుంపేటలో 30.9, పెదబయలులో 31.0, అనంతగిరిలో 31.4, డుంబ్రిగుడలో 32.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నైరుతి రుతుపవనాలు మరింతగా బలపడితే వాతావరణంలోని మార్పులతో ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ముంచంగిపుట్టును వీడని వర్షం

ముంచంగిపుట్టు: మండల పరిధిలో మూడు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. ప్రతిరోజూ సాయంత్రం వర్షం పడుతోంది. శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ... మిగతా 8వ పేజీలో



పెదబయలులో కారుపై విరిగిపడిన చెట్టు కొమ్మలు



బొండపల్లిలో గిరిజనుడి ఇల్లుపై పడిన వృక్షం

ఏయూలో విగ్రహం మాటేమిటో?

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం తొలగించాలని రెండు రోజులుగా విద్యార్థుల ఆందోళన

- పాలక మండలి అంగీకారం
- ఏయూలోనూ వైఎస్ఆర్ విగ్రహం
- 2009లో ఏర్పాటు... అప్పట్లోనే విమర్శలు
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కూడిన ఆ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేయించిన ప్రస్తుత వీసీ ప్రసాదరెడ్డి
- విగ్రహం తొలగించాల్సిందేనని విద్యార్థి సంఘాల డిమాండ్



వైఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వీసీ ప్రసాదరెడ్డి (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని విద్యార్థి సంఘాల డిమాండ్ మేరకు శుక్రవారం పాలక మండలి తొలగించింది. విద్యా సంస్థల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు ఉండకూడదనే నిబంధనను ఉల్లంఘించి ఏర్పాటుచేసినందున దానిని తొలగించాలంటూ విద్యార్థి సంఘాలు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నాయి. దాంతో అధికారులు విగ్రహం తొలగించేందుకు అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గల వైఎస్ఆర్ విగ్రహంపై చర్చ మొదలైంది. ఎప్పుడు తొలగిస్తారో ఇక్కడి అధికారులు ప్రకటించాల్సి ఉంది.

పదవుల కోసం విగ్రహాలు

పదవుల కోసం, తమ మనుగడ కోసం కొంతమంది ఆచార్యులు సరస్వతీ నిలయాల్లో రాజకీయ క్రీడకు తెరతీశారు. ఆ విధంగానే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటైంది. దానిపై ఆనాడే విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అప్పుడు ఉప కులపతిగా బీల సత్యనారాయణ ఉన్నప్పటికీ తెర వెనుక కథ అంతా నడిపింది మాత్రం ప్రస్తుత వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డేనని చెబుతారు. అక్కడితో ఊరుకోలేదు. వీసీ సీట్లో కూర్చున్నాక ... మిగతా 7వ పేజీలో

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

ఏజెన్సీలో ఇష్టారాజ్యంగా వృక్షాల నరికివేత

- హుకుంపేటలో ప్రభుత్వ చెట్లు తొలగింపు
- అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన వైనం
- పట్టించుకోని పారెస్టు ఆర్‌ఎంపీ అధికారులు

హుకుంపేట, జూన్ 7: ఏజెన్సీలో పచ్చని చెట్లు అక్రమార్కుల గొడ్డలకు బలైపోతున్నాయి. ఏళ్లుగా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి పెంచుతున్న భారీ వృక్షాలను కూకటివేళ్లతో సహా పెకిలిస్తున్న అక్రమార్కులు వాటిని కలపగా మార్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రమైన హుకుంపేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ, ఫారెస్టు సోషల్ డిపార్ట్‌మెంట్ నాటిన మొక్కలు భారీ వృక్షాలుగా మారాయి. వీటిపై అక్రమార్కుల కన్ను పడింది. దీంతో ఇటీవల ఈ చెట్లను వ్యాపారులు అక్రమంగా తొలగించి, కలపను యథేచ్ఛగా తరలిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ బాలికల వసతిగృహం సమీపంలోని భారీ చెట్లను, గిరిజన సహకార సంస్థ సమీపంలోని యూకలిప్టస్ చెట్ల కొమ్మలు నరికివేసి కలపను సిద్ధం చేశారు. ఆ తరువాత యంత్రాలతో వాటిని ముక్కలుగా చేసి, విక్రయానికి ... మిగతా 8వ పేజీలో



హుకుంపేటలో ప్రభుత్వ చెట్లను నరికివేసి, విక్రయానికి సిద్ధం చేసిన కలప

క్రైం... crime news

విద్యుదాఘాతంతో రైతు మృతి


దాడి సంతోష్ అప్పారావు (ఫైల్ ఫొటో)

మునగపాక (తుమ్మపాల), జూన్ 7: మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై రైతు దాడి సంతోష్ అప్పారావు (36) మృతి చెందారు. రోజు మాదిరిగానే తండ్రితో కలిసి పొలంలో పనులు చేపట్టేందుకు వెళ్తున్న సంతోష్, పొలం దగ్గర విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న వైరు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సంతోష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే సంతోష్ మృతి చెందడంతో కుటుంబమంతా ఆధారం కోల్పోయింది. ఈ సంఘటనతో గ్రామమంతా విషాదఛాయలు అలముకున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణం పోయిందని గ్రామస్థులు మండి పడుతున్నారు. సంతోష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి బెదిరింపు కాల్

- డబ్బులు ఇవ్వకపోతే కుమారుడ్ని చంపేస్తానన్న నిందితుడు
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సునీల్.... (ఇన్‌సెట్లో) నిందితుడు పవన్

కొమ్మాది, జూన్ 7: డబ్బులు ఇవ్వకపోతే కుమారుడ్ని చంపేస్తానని బెదిరించిన వ్యక్తిని పీఎంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నార్త్ జోన్ ఏసీపీ సునీల్, పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దారపాలెం గ్రామానికి చెందిన శివకోటి నాగ వెంకట పవన్ జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో సుమారు రూ. 15 లక్షల వరకూ అప్పులు చేశాడు. ప్రస్తు తం అతను పీఎంపాలెంలో నివసిస్తున్నాడు. ఈనెల 2న అతను పీఎంపాలెం కార్ షెడ్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పోతిన వెంకట్రావుకు వాట్సాప్ కాల్ చేసి రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే తన కుమారుడ్ని చంపుతానని బెదిరించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన వెంకటరావు ఆ నంబరును బ్లాక్ చేశాడు. రెండు రోజుల తరువాత నంబరును అన్ బ్లాక్ చేయగా డబ్బులు ఇవ్వకపోతే నీ కుమారుడ్ని చంపేస్తానని పవన్ నంబరు నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో భయపడిన బాధితుడు పవన్‌కు ఫోన్ చేసి తన కుమారుడికి హాని తలపెట్టవద్దని రూ. 5 లక్షల ఇవ్వడానికి అంగీకరించాడు. డబ్బులు సమకూర్చుకునేందుకు 6వ తేదీ ఉదయం 11 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించాడు. ఈమేరకు గురువారం ఉదయం 7.59 నిమిషాలకు పవన్ సెల్ నుంచి మెసేజ్ వచ్చింది. డబ్బులు సాంకేతిక కళాశాల వద్ద ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకురావాలని తెలిపాడు. ఈ విషయాన్ని బాధితుడు పీఎం పాలెం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బాధితుడు పవన్‌కు డబ్బులిచ్చే సమయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.2.40 లక్షల నగదు, కారు,సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కాగా తనకు అప్పులు తీర్చే మార్గం తెలియక ఈ బెదిరింపునకు పాల్పడినట్టు నిందితుడు తెలిపారు.

వైసీపీ కార్యాలయ సిబ్బందికి జీతాలు నిల్

- రెండు నెలలుగా పెండింగ్
- మేనేజర్‌కు మూడు నెలలుగా అందని వేతనం
- రెండు నెలలుగా విద్యుత్ బిల్లు కూడా కట్టలేదని సమాచారం


ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకున్న భూమిలో నిర్మించిన వైసీపీ కార్యాలయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం గత మూడు రోజులుగా వెలవెలబోతోంది. ఎన్నికల్లో ఘోర పరాజయం చవి చూడడంతో నాయకులు కన్నెత్తి చూడడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమిని లీజు (ఏడాదికి కేవలం వెయ్యి రూపాయలు) ప్రాతిపదికన కేటాయించుకుని పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మించారు. కార్యాలయాన్ని చూసుకోవడానికి వాచ్‌మన్‌ను, మొక్కలకు నీరు పోయడానికి ఒకరిని, కార్యాలయాన్ని శుభ్రం చేయడానికి ఇద్దరిని, వచ్చే అతిథులకు టీ, కాఫీలు అందించడానికి ఇద్దరు పనివాళ్లను పెట్టుకున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.7 వేలు నుంచి రూ.8 వేల జీతం ఇస్తున్నారు. అదే వారికి జీవనాధారం. ఉదయం 9 గంటలకు వచ్చి, సాయంత్రం ఆరు గంటల వరకూ అక్కడే ఉంటారు. ఇంకో పని చేసుకోవడానికి లేదు. అయితే వీరికి గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. పార్టీ కార్యాలయ నిర్వహణ బాధ్యత జిల్లా అధ్యక్షులు చూసుకోవాలి. మొదటి నుంచి దానిని అంతా భారంగానే భావిస్తూ వచ్చారు. ప్రస్తుత అధ్యక్షులు కోలా గురువులు తాను జీతాలు ఇచ్చే స్థితిలో లేనని ముందే చెప్పడంతో ఈ బాధ్యతను గాజువాకకు చెందిన దామా సుబ్బారావుకు అప్పగించారు. ఆయన వ్యక్తిగత కారణాలతో పార్టీ కార్యక్రమాలకు ఇటీవల హాజరుకావడం లేదు. దాంతో సిబ్బందికి జీతాలు లేవు. ఈ విషయాన్ని ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినా పెద్దగా పట్టించుకోలేదు. నాలుగు రోజుల నుంచి కార్యాలయానికి ఎవరూ రావడం లేదు. రెండు నెలలుగా జీతాలు లేవని, తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. పార్టీ కార్యాలయానికి సెంట్రల్ ఆఫీసు ఒక మేనేజర్‌ను నియమించింది. ఆయనకు కూడా మూడు నెలలుగా జీతం ఇవ్వలేదని తెలిసింది. పార్టీ అధికారంలో ఉంటే ఈరోజు కాకపోతే రేపు అయినా ఇస్తారనే నమ్మకం పని వారిలో ఉండేది. ఇప్పుడు పార్టీ ఓడిపోవడం, నాయకులు ఎవరూ కార్యాలయం ముఖం చూడకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు. జీతాలే కాకుండా టీ, కాఫీల కోసం తీసుకున్న పాలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా పెండింగ్ ఉండిపోయాయి. ఈ భవనానికి మార్చి నెల వరకూ బిల్డర్ విద్యుత్ బిల్లు చెల్లించేవారు. అప్పగించేసిన తరువాత పార్టీయే కట్టుకోవలసి ఉంది. ఏప్రిల్ నుంచి ఆ బిల్లు కూడా చెల్లించలేదని తెలిసింది.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి: డీఎస్పీ

పరవాడ, జూన్ 7: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఫార్మాసిటీ ప్రాంగణంలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డీజీఎం (హెచ్‌ఆర్ విభాగం) గిరిధరరావుబక్షి, ఉద్యోగులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

నత్తనడకన 'జల్‌జీవన్' పనులు

- మండల వ్యాప్తంగా రూ.ఆరు కోట్ల మంజూరు
- 88 వర్కులకు కేవలం 18 మాత్రమే పూర్తి
- త్వరితగతిన పూర్తిచేసి నీటి కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకోలు


అంటిమానుజోర్లు గ్రామంలో ఏడాది క్రితం ఏర్పాటు చేసిన బోరు

గొలుగొండ, జూలై 7: ఇంటింటికీ తాగునీరు అందించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు మండలంలో నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం 88 వర్కులు మంజూరుకాగా, 18 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినచోట పనులు ప్రారంభంకాని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మండు వేసవిలో ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పలేదు. మండలంలోని 27 పంచాయతీల్లోని 18 గ్రామాల్లో ఈ పథకంలో భాగంగా పనులు చేపట్టేందుకు ఆరు కోట్ల రూపాయలను మంజూరు చేశారు. ఈ నిధులతో 88 వర్కులు చేయాల్సి ఉండగా, వీటిలో పద్దెనిమిది పనులను మాత్రమే సంబంధిత అధికారులు పూర్తి చేశారు. రుత్తలపాలెం, కొత్తూరు, కరక, లింగంపేట,


గొలుగొండలో ఏడాదిగా వృథాగా ఉన్న పైప్‌లు

లింగందొరపాలెం, వెంట్రామపురంతో పాటు మరో పన్నెండు గ్రామాల్లో ఈ పనులు పూర్తయ్యాయి. పాతమల్లంపేట పంచాయతీ శివారు అంటిమానుజోర్లు గ్రామంలో గత ఏడాది ఈ పనుల్లో భాగంగా బోరు తవ్వారు. కానీ నేటికీ దానికి మోటారు బిగించలేదు. దీంతో ఆయా పరిధిలోని గ్రామాల వారికి తాగునీటి ఇబ్బందులు తప్పలేదు. త్వరితగతిన పనులు పూర్తి చేసి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుధీషణను వివరణ కోరగా, 18 గ్రామాల్లో జల్‌జీవన్ పనులు పూర్తిచేసి నిరంతరం ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. మిగిలిన 70 వర్కుల్లో 42 వర్కులు ప్రారంభించామన్నారు. మిగిలిన చోట ప్రారంభం కాలేదని చెప్పారు. డ్వాక్రా సంఘ సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి, బ్యాంకుల్లో ఖాతాలు ప్రారంభించామన్నారు. తద్వారా పనులు చేపడతామని తెలిపారు.

ఎలమంచిలిలో అధిక లోడు వాహనాల రాకపోకలు

- పోలీసు నిబంధనలు బేఖాతరు
- ఆందోళన చెందుతున్న పట్టణ వాసులు


ఎలమంచిలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైనుంచి పట్టణంలోకి రాకపోకలు సాగిస్తున్న అధిక లోడు వాహనాలు

ఎలమంచిలి, జూన్ 7: పట్టణంలో అధిక లోడు వాహనాలు విచ్చలవిడిగా రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల ప్రారంభించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచి అధిక లోడుతో ఉన్న లారీలు పగలు, రాత్రి అని తేడా లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు పట్టణంలోకి అనుమతి లేదంటూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయినా ఆ హెచ్చరికలను వాహనదారులు బేఖాతర్ చేస్తున్నారు. నిబంధనలు కాదని అధిక లోడుతో లారీలు పట్టణం మీదుగా రాంబిల్లి వైపు రాకపోకలు సాగిస్తుండడంతో పట్టణ వాసులతో పాటు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పగలు వచ్చిన వాహనాల కంటే చీకటి పడితే తర్వాత రెట్టింపుగా తిరుగుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు నిబంధనలు ప్రకారం అధికలోడు వాహనాల రాకపోకలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పచ్చిరొట్ట వేసుకుంటే ఎంతో మేలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు

అనకాపల్లి రూరల్, జూన్ 7: పచ్చిరొట్ట వేసుకుంటే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జి.మోహనరావు తెలిపారు. జిల్లాలోని 24 మండలాల్లో వివిధ రైతుభరోసా కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీపై 373 క్వింటాళ్ల జనుము, 559 క్వింటాళ్ల జీలుగ, 124 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. జనుము, జీలుగ కిలో 44 రూపాయలకు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే పిల్లిపెసర కిలో 67 రూపాయలకు రాయితీపై రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్నట్టు చెప్పారు. పచ్చిరొట్ట పైరును వరి పంట వేసుకునే ముందు మే, జూన్ నెలల్లో విత్తుకుని, పూత దశకు వచ్చే సమయంలో తొలకరి వర్షాలు పడ్డాక వెంటనే పొలంలో కలియదున్నాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలను నీటిలో 24 గంటల సేపు నానబెట్టి విత్తుకోవడం వల్ల మొలక బాగా వస్తుందన్నారు. జనుము వేసుకున్నట్లయితే ఎకరాకు 20 నుంచి 25 కిలోల విత్తనాన్ని, జీలుగ 12 నుంచి 15 కిలోల విత్తనాన్ని, పిల్లిపెసర ఐదు నుంచి ఆరు కిలోల విత్తనాన్ని విత్తుకోవాలన్నారు. జనుము ఎకరానికి నాలుగు నుంచి ఆరు టన్నుల పచ్చిరొట్ట ఎరువును ఇస్తుందని చెప్పారు. దీనిద్వారా 40 కిలోల నత్రజని, ఆరు కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం నేలకు లభిస్తుందన్నారు. జీలుగ ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది టన్నుల పచ్చిరొట్ట ఎరువును ఇస్తుందన్నారు. దీనిద్వారా 30 కిలోల నత్రజని, ఎనిమిది కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం నేలకు లభిస్తుందన్నారు. విస్తారమైన నేలలు, చౌడు భూముల్లో కూడా బాగా పెరుగుతుందన్నారు. పిల్లిపెసర ఎకరానికి సుమారు రెండు నుంచి నాలుగు టన్నుల పచ్చిరొట్ట ఎరువును ఇస్తుందన్నారు. దీని ద్వారా 18 కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం, 13 కిలోల పొటాషియం నేలకు లభిస్తుందన్నారు. నేలలో నీటి నిల్వలు, నీటి ఎద్దడి ఉన్నా తట్టుకుంటుందని ఆయన వివరించారు.

డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

- బీఎస్సీ జువాలజీ, బీఏ హిస్టరీ ఆనర్స్‌కు అనుమతి

ఎలమంచిలి, జూన్ 7: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి నూతన కోర్సులకు అనుమతి లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. కళాశాలలో బీఎస్సీ జువాలజీ, బీఏ హిస్టరీ ఆనర్స్ కోర్సులకు అనుమతి వచ్చిందన్నారు. ఇప్పటివరకు బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్స్, అప్లికేషన్స్, బీఎస్సీ, కెమిస్ట్రీ, బోటనీ, కంప్యూటర్స్ కోర్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. నూతనంగా మంజూరైన రెండు కోర్సులతో కలిసి ఏడు కోర్సులకు చేరిందన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 18వ తేదీ నుంచి అడ్మిషన్ల నమోదు ప్రారంభమవుతుందన్నారు. కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

గంటాకు టీడీపీ నేతల అభినందనలు


గంటా శ్రీనివాసరావుకు సాయిబాబా చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి నుంచి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు నాయకులతో కలిసి ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ మేరకు గంటా శ్రీనివాసరావుకు సాయిబాబా చిత్రపటాన్ని బహూకరించి దుశ్శాలువలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు సీఎస్ఆర్ నిధులు

- సుమారు రూ.20 కోట్లతో వార్డులు, క్యాజువాల్టీల్లో సదుపాయాలు
- మరో రూ.10 కోట్లతో సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలు
- సజావుగా ఎన్నికల ప్రక్రియ
- పాత్రికేయుల సహకారం మరువలేనిది
- కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన సీపీ, జేసీ

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వివిధ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద అందించిన నిధుల నుంచి సుమారు రూ.30.82 కోట్లు వెచ్చించి కేజీహెచ్, సంక్షేమ వసతి గృహాలు అభివృద్ధి చేశామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మందికి వైద్యం అందించే కేజీహెచ్‌లో రూ.18 కోట్లతో అనేక వార్డులు, క్యాజువాల్టీల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ ఇతర పరీక్షలకు కొత్త మిషనరీ తెప్పించామని, రోగుల కోసం బ్యాటరీ వాహనాలు సమకూర్చామన్నారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో రూ.రెండు కోట్లతో బర్న్స్ వార్డును ఆధునికీకరించడానికి ప్రతిపాదించామన్నారు. అలాగే సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 23 వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మేరకు పూర్తిస్థాయి వసతుల కల్పనకు రూ.10.82 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో పేదలకు వైద్యం, ఇతరత్రా సాయం అందించడానికి సంజీవని నిధి ఏర్పాటుచేశామన్నారు. భవిష్యత్తులో ఆదాయం పెంచుకునేందుకు యంత్రాంగం ఆధ్వర్యంలో నాలుగు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామన్నారు.

గత ఏడాది చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ నుంచి మూడు రోజుల క్రితం ముగిసిన ఎన్నికల ప్రక్రియ వరకు అంతా సజావుగా సాగిందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే పత్రికలు వెంటనే వెలుగులోనికి తీసుకురావడంతో చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్లు, అన్ని పార్టీల నేతలు, అధికారులు, సిబ్బంది సహకరించారన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల సహకారం మరువలేనిదని కొనియాడుతూ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమాజానికి అన్ని విధాలుగా సేవలు అందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరఫున అనేక విధాలుగా కృషిచేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. గత ఏడాది జర్నలిస్టులకు ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించామని, ఉచిత వైద్యపరీక్షలు చేపట్టామన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అపోలో ఆస్పత్రిలో జర్నలిస్టుతోపాటు జీవిత భాగస్వామికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి జిల్లా పౌర సంబంధాల అధికారి షెడ్యూల్ ఖరారు చేస్తారన్నారు. జర్నలిస్టులకు వచ్చే ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించేందుకు నిధి ఏర్పాటుచేశామని తెలిపారు. అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలకు రెండు, మూడు చోట్ల భూమి గుర్తించి రేటు ఖరారుచేశామన్నారు. అయితే కొత్త ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలకోసం కార్యాచరణ రూపొం దిస్తామన్నారు. సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో మీడియా ప్రశంసనీయమైన పాత్ర పోషించిందన్నారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, నియోజకవర్గ ఆర్వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, లక్ష్మారెడ్డి, అఖిల, శేషశైలజ, సీతారామమూర్తి, డీపీఆర్వో ఎస్వీ రమణ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన అనిత


నారా లోకేశ్‌తో ఎమ్మెల్యే అనిత

నక్కపల్లి, జూన్ 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శుక్రవారం ఉండవిల్లిలోని ఆయన నివాసం వద్ద పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరి నుంచి నారా లోకేశ్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో అనిత పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాయకరావుపేట నుంచి రెండోసారి రికార్డు స్థాయి మెజారిటీతో గెలిచిన అనితను కూడా లోకేశ్ అభినందించారు.

పాఠ్య పుస్తకాలకు రికార్డులు పక్కాగా ఉండాలి

- డీఈవో వెంకటలక్ష్మమ్మ


పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో

కశింకోట, జూన్ 7: పాఠ్య పుస్తకాలకు సంబంధించి రికార్డులన్నీ పక్కాగా ఉండాలని జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ స్పష్టం చేశారు. కశింకోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చిన నోట్, పాఠ్య పుస్తకాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో 43 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలలకు కలిపి మొత్తం 33,155 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు 90 శాతం మేరకు వచ్చినట్టు ఆమె చెప్పారు. అలాగే మండలం మొత్తం ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు 9,530 జతల షూస్ వచ్చాయన్నారు. 2024 విద్యా సంవత్సరానికి సరిపడా మొత్తం పుస్తకాలన్నీ సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వై.వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 కేఎస్ఎన్.మూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికా సాధికారతకు 'సింహాద్రి' కృషి అమోఘం

- ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (పర్సనల్) సురేష్ చంద్రపాండే


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్

పరవాడ, జూన్ 7: బాలికా సాధికారత కోసం సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషి అమోఘమని ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (పర్సనల్) సురేష్ చంద్రపాండే ప్రశంసించారు. దీపాంజలి నగర్ శకుంతల ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సింహాద్రి బాలికా సాధికారత మిషన్-2024 ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాద్రి సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా బాలికా సాధికారత కోసం చేస్తున్న కృషిని అభినందించారు. నిర్వాసిత గ్రామాలకు చెందిన 120 మంది బాలికలను ఎంపిక చేసి, వారికి నెల రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. కాగా, విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. శిక్షణ పొందిన విద్యార్థినులను సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అభినందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాభారతి అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

చోడవరం, జూన్ 7: జిల్లా క్రీడాభారతి నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడిగా చోడవరం ఉషోదయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా కె.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా చిన్ని వీరాంజనేయులు, కోశాధికారిగా పుల్లేటి మారుతి, సభ్యులుగా వర్మ, సాయిలక్ష్మి, చంద్రశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర క్రీడాభారతి అధ్యక్షులు మాణిక్యాలరావు, ఉపాధ్యక్షులు వేణు, ప్రసాదరాజుల ఆధ్వర్యంలో ఈ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

గురుకులం డార్మిటరీ ప్రారంభం

నక్కపల్లి, జూన్ 7: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం కిచెన్ కమ్ డైనింగ్ హాలును గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ రూపవతి, ప్రిన్సిపల్ కేఎస్ రత్నకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ హాలు పూర్తిగా పాడవడంతో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా రూపవతి మాట్లాడుతూ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన కిచెన్, డైనింగ్, డార్మిటరీలతో ఇక సమస్యలు వుండవని చెప్పారు.

ఏయూలో విగ్రహం మాటేమిటో?

... 5వ పేజీ తరువాయి

ప్రసాదరెడ్డి వైఎస్ఆర్‌సీపీకి ప్రధాన వ్యూహకర్తగా మారిపోయారు. ఉత్తరాంధ్ర పార్టీ బాధ్యతలు చేపట్టిన ఎంపీ విజయసాయిరెడ్డికి ఈ ప్రాంతంపై పట్టు లేకపోవడంతో విద్యావంతుడైన ప్రసాదరెడ్డిపై ఆధారపడ్డారు. అదే అదునుగా వీసీ చక్రం తిప్పారు. పార్టీలో నాయకులపై నివేదికలు ఇవ్వడం, జీవీఎంసీ ఎన్నికల్లో టికెట్ల ఖరారు, ఆ తరువాత నామినేటెడ్ పోస్టులు ఎవరికి ఇవ్వవచ్చు..అనే అంశాలపై ఆయనే ఫీడ్ బ్యాక్ ఇచ్చేవారు. పార్టీ జయాపజయాలపై విద్యార్థులతో సర్వేలు చేయించి నివేదికలు పంపేవారు. ఏయూను రాజకీయ కేంద్రంగా మార్చేశారు. గత ఏడాది చివరిలో ఆయన పదవీకాలం పూర్తవుతున్న తరుణంలో ఏయూలో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గతంలో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ విగ్రహం స్థానంలో కొత్తగా భారీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయించారు. ఇదంతా గత ఏడాది జూలైలో జరిగింది. విగ్రహానికి అంతా పూలమాలలు వేసి నివాళులు అర్పించేందుకు వీలుగా చుట్టూ రెయిలింగ్ నిర్మించారు. ప్రసాదరెడ్డి వీసీ అయినప్పటి నుంచి వైఎస్ జయంతి, వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించేవారు. జగన్ పుట్టినరోజు నాడు ఆ విగ్రహం ముందే కేక్ కట్ చేసేవారు. వాటిపై పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టించుకునేవారు కాదు. వైసీపీ కోసం పనిచేసిన వీసీని సాగనంపడంతో పాటు క్యాంపస్‌లో వైఎస్ విగ్రహాన్ని తొలగించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలకు అంతరాయం

» పాడేరు టెలిఫోన్ ఎక్స్ఛేంజీ పరిధిలో తరచూ మొరాయింపు

» పట్టించుకోని సెల్‌వన్ అధికారులు.. వినియోగదారుల ఇక్కట్లు

పాడేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మన్యంలో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు తరచూ మొరాయిస్తున్నాయి. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజీ పరిధి లోని హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం సాయంత్రం మూడు నుంచి ఆరు గంటల వరకు బీఎస్‌ఎన్ ఎల్ సేవలు స్తంభించాయి. దీంతో ఐదు మండలాలకు చెందిన వినియోగదారులు తీవ్రమన ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రం పాడేరులో ఈ సమస్య కారణంగా ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య రెట్టింపవుతోంది. బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ సేవలతో పాటు ఇంటర్నెంట్ సేవలకు అంతరాయం ఏర్పడడంతో ఇంటర్నెంట్ ఆధార పనులన్నీ నిలిచిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు సంస్థల పనులకు సైతం అంతరాయం ఏర్పడుతున్నది. టెలికాం ఎక్స్ఛేంజీలో కాకుండా మైదాన ప్రాంతం నుంచి పాడేరుకు ఉన్న ఆప్టికల్ ఫైబర్ కేబుల్ సమస్య కావడంతో స్థానిక సిబ్బంది ఏమీ చేయలేదని పరిస్థితి నెలకొంది. కారణం ఏదైనప్పటికీ సమాచార సేవలకు అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సరికదా బీఎస్ఎల్ఎల్ ఉన్నతాధికారులు ఇది గమనించి పాడేరు, పరిసర ప్రాంతాల్లో సేవలకు అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

చిన్ననాటి మిత్రుల ఔదార్యం

» మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని భార్యకు ఆర్థిక సాయం చేస్తున్న మిత్ర బృందం

పాడేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయిన ఓ మిత్రుడి కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. తమవంతుగా మృతుని భార్యకు ఆర్థిక సాయం చేశారు. మండలంలో లగిశపల్లి పంచాయతీ పార్వతీపురం కాలనీకి చెందిన తలారి శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయనతో కలిసి చదువుకున్న మిత్రులు శుక్రవారం మృతుని ఇంటికి వచ్చి కుటుంబాన్ని ఓదార్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొంటూ, తమవంతుసాయంగా రూ.23,220 మృతుని భార్య విమలసాయికి అందించారు. అలాగే భవిష్యత్‌లోనూ స్నేహితులంతా శ్రీకాంత్ కుటుంబానికి చేదోడుగా ఉంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మృతునికి కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులును పలువురు అభినందించారు.

పాడేరు ఎస్ఈబీ స్టేషన్‌కు అవార్డు

పాడేరు రూరల్, జూన్ 7: పాడేరు ఎస్ఈబీ స్టేషన్‌కు బెస్ట్ స్టేషన్ అవార్డు లభించింది. ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో మన్యంలో విధులను చక్కగా నిర్వహించనందుకు ఎస్ఈబీ స్టేషన్ సీఐ, ఎస్ఐలతో పాటు సిబ్బంది చక్కని ప్రతిభను కనబర్చినట్టు గుర్తించిన ఎస్పీ తుహిన్ సిన్హా, ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఏఈఎస్ నాగరాహుల్ ఉన్నతాధికారులకు సిఫారసు చేయడంతో ఎస్ఈబీ కమిషనర్ ఎం.రవిప్రకాష్ శుక్రవారం విజయవాడలో అవార్డులకు ఎంపిక చేశారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమంలో అత్యుత్తమ పనితీరును కనపర్చినందుకు స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఎస్ఐ టి.సురేష్‌కుమార్‌కు బెస్ట్ కలెక్టింగ్ ఇంటిలిజెన్స్ లీడింగ్ ఆఫ్ ఎఫెక్టివ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అవార్డును అందించారు. విజయవాడలో శుక్రవారం అవార్డు అందుకున్న ఎస్ఐ సురేష్‌కుమార్‌ను ఎస్ఈబీ స్టేషన్ అధికారులు, సిబ్బంది, సహచర ఉద్యోగులు అభినందించారు.



ఎస్ఈబీ కమిషనర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్ఐ సురేష్‌కుమార్

ఉపాధి బిల్లులు సకాలంలో చెల్లించరూ..



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

డుంబ్రిగుడ, జూన్ 7: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేసిన నెలలు గడుస్తున్నా బిల్లులు సకాలంలో చెల్లించలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ఆదాయం లేక కేవలం ఉపాధి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, దీంతో పనులు చేసిన తామంతా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నామని వాపోయారు. సకాలంలో ఉపాధి పథకం బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల అధికారులు తక్షణమే స్పందించి ఉపాధి పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మన్యంలో చల్లని వాతావరణం

... 5వ పేజీ తరువాయి

విజృంభించింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు చిత్తడైపోయాయి. పలు గ్రామాలకు వెళ్లే మట్టి రహదారులు బురదమయంగా మారుతున్నాయి. వాగులు వంకలు వరదనీటితో ప్రవహిస్తున్నాయి. మత్స్యగెడ్డ పాయల్లోకి వర్షం నీరు చేరుతోంది.

పెదబయలులో భారీ వర్షం

పెదబయలు: మండలంలో శుక్రవారం పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ కురిసింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. భారీ వర్షానికి రహదారులు చిత్తడిగా మారాయి. బొండపల్లి పంచాయతీ ఎగువ బొండపల్లిలో పలాసి పండన్న అనే గిరిజనుడి ఇంటిపై భారీ వృక్షం పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోడంతో పెను ప్రమాదం తప్పింది.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

... 5వ పేజీ తరువాయి

సిద్ధం చేస్తున్నారని స్థానికులు తెలిపారు. చెట్ల తొలగింపుతో పచ్చదనం కనుమరుగవుతోందని, ఏజెన్సీలోనూ వేడి వాతావరణం నెలకొంటోందని వాపోతున్నారు. భారీ వృక్షాలను పరిరక్షించాల్సిన అటవీ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో ఇటీవల అక్రమార్కులు చెట్లను ఇష్టానుసారం నరికి, అమ్ముకుంటున్నారని చెబుతున్నారు. పంచాయతీ, రెవెన్యూ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెట్లను అక్రమంగా నరికి సొమ్ముచేసుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కలపను రాత్రి సమయంలో తరలిస్తున్నారని, యంత్రాంగం గట్టి నిఘాను ఏర్పాటుచేస్తే అక్రమాలు బయట పడతాయని చెబుతున్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

» పాడేరు డీసీహెచ్ఎస్ డాక్టర్ క్రిష్ణారావు



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ క్రిష్ణారావు

చింతపల్లి, జూన్ 7: ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పాడేరు డీసీహెచ్ఎస్ డాక్టర్ కిల్లు క్రిష్ణారావు ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శుక్రవారం సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ల్యాబర్ రూం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ కావడంతో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగిందన్నారు. వారికి మెరుగైన చికిత్స అందించేందుకు వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రిలో నిర్మిస్తున్న నూతన ఆపరేషన్ థియేటర్ సాధ్యమైనంత వేగంగా ప్రారంభించాలన్నారు. ప్రసవం కష్టమైన గర్భిణులకు ఇక్కడే శస్త్ర చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి అనుబంధంగా ఐటీడీఏ ఏర్పాటు చేసిన వసతిగృహాన్ని గర్భిణులు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు వసతి గృహంలోని గర్భిణులకు తనిఖీలు నిర్వహిస్తూ నొప్పులు ప్రారంభంకాగానే ఆస్పత్రికి తీసుకురావాలన్నారు. అలాగే వారికి ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేయాలన్నారు. గతంతో పోల్చుకుంటే ఆస్పత్రిలో వైద్యసేవలు మెరుగుపడ్డాయన్నారు. నూతనంగా నియమితులైన సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్టు సమాచారం ఉందన్నారు. వైద్యులు బాధ్యతాయుతంగా, అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు, వైద్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు రూట్ల మార్పు

» మోదకొండమ్మ ఉత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

» పాడేరు సీఐ నవీన్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్

పాడేరు రూరల్, జూన్ 7: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఉత్సవాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం రూట్లు మార్పు చేసినట్టు సీఐ డి.నవీన్‌కుమార్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి 11వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఉత్సవాల మూడు రోజులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రూట్లు మార్పు చేశామన్నారు.

అరకు, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాల నుంచి విశాఖపట్నం, జి.మాడుగుల ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు చింతలవీధి సమీపంలోని అడారిమెట్ట గ్రామం నుంచి సన్యాసమ్మపాలెం మీదుగా వంతాడపల్లి చెకెపోస్టు మీదుగా వెళ్లాలని సీఐ తెలిపారు. అలాగే జి.మాడుగుల నుంచి విశాఖపట్నం, అరకు, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనదారులు పాడేరు సెయింట్‌ఆన్స్ స్కూల్ మీదుగా లగిశపల్లి మార్గంలో నక్కలపుట్టు నుంచి వంతాపల్లి చెకోగేటు నుంచి వెళ్లాలనన్నారు. పాడేరు గ్రామస్తులకు సంబంధించిన వాహనాలు సినిమాహాలు జంక్షన్ నుంచి డిగ్రీకళాశాల మీదుగా ఎంపీడీవో కార్యాలయం నుంచి వెళ్లాలన్నారు. శనివారం ఉదయం నుంచి 11వ తేదీ మంగళవారం వరకు పాడేరు ఘాట్‌లోకి భారీ వాహనాల రాకపోకలను నిషేధించినట్టు ఆయన తెలిపారు. మైదాన ప్రాంతం నుంచి పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట తదితర మండలాలకు సామగ్రిని తరలించే భారీ వాహనాలను ముందస్తుగానే ఘాట్ మార్గంలోకి ప్రవేశించకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. జి.మాడుగుల ప్రాంతం నుంచి వచ్చే వారికి సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద, చోడవరం, విశాఖ తదితర మైదాన ప్రాంతం నుంచి వచ్చే భక్తుల వాహనాలను ఎస్పీ ఆఫీస్ సమీపంలోని ఖాళీ స్థలంలో, అరకు, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వాహనాలను తలారిసింగి సీఏహెచ్.స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. వృద్ధులను ఆటోల ద్వారా దర్శనానికి తరలించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జాతరకు వచ్చే భక్తులు విలువైన ఆభరణాలు ధరించవద్దని, మద్యం తాగి ఆలయంలోకి, జాతరలోకి రావద్దని, చిన్నపిల్లలతో జాతరకు వచ్చే భక్తులు ఫోన్ నంబరు చీటీలను పిల్లల జేబుల్లో ఉంచాలని ఆయన సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోండి

» ఎంఈవో పనసల ప్రసాద్

» ముగిసిన గ్రంథాలయల వారోత్సవాలు



చింతపల్లిలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో... పాడేరులో బహుమతులు చూపుతున్న చిన్నారులు

చింతపల్లి, జూన్ 7: బాల్యం నుంచి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాశాఖాధికారి పనసల ప్రసాద్ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ గ్రంథాలయంలో దినపత్రికలతో పాటు పోటీ పరీక్షలు, నీతి కథలు, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు ఉంటాయన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయాన్ని సందర్శించి ఈ పుస్తకాలను చదవాలన్నారు. అలాగే విద్యతోపాటూ క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సూర్యనారాయణ, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపీనాథ్ పాల్గొన్నారు.

పాడేరు రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ శిబిరంలో పాఠకులు, చిన్నారులు, విద్యార్థులకు సామర్థ్యాన్ని బట్టి వివిధ పోటీలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం శాఖా గ్రంథాలయాధికారిణి ఎం.సత్యవతి మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.

జి.మాడుగుల: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుతులను అందజేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రమంగా శిక్షణ తరగతులకు హాజరై తమ ప్రతిభను కనబరిచారని గ్రంథాలయం ఉద్యోగి వి.మహేశ్ చెప్పారు.

రహదారి అధ్వానం.. ప్రయాణానికి నరకం!

» ముంచంగిపుట్టు-పెదబయలు రోడ్డులో గతుకులు



కోతకు గురైన ముంచంగిపుట్టు, పెదబయలు రహదారి

ముంచంగిపుట్టు, జూన్ 7: ప్రధాన రహదారి పరమ అధ్వానంగా తయారైంది. రాకపోకలకు వాహన చోదకులు ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తోంది. అయినప్పటికీ అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది.

ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గం మధ్యలో చోటాముఖిపుట్టు సమీపంలో ప్రధాన రహదారి దెబ్బతింది. గత ఏడాది కురిసిన వర్షాలకు ఆ ప్రదేశంలో ఆర్‌అండ్‌బీ రహదారి కోతకు గురైంది. దాని బాగోగులపై సంబంధిత అధికారులు కనీసం దృష్టిసారించలేదు. ఫలితంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి మరికాస్త దెబ్బతింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. వంతెన ముందు భాగంలో రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడడం, పలు చోట్ల రహదారి కోతకు గురికావడంతో ఆ ప్రదేశంలో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది. రాత్రి వేళల్లో ఆదమరిచి అటుగా వెళితే ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం లేకపోలేదు. ఈ మార్గం పై నుంచే డుడుమ జలపాతానికి, మాచఖండ్ జల విద్యుత్ కేంద్రానికి చూసేందుకు పర్యాటకులు సైతం ఎక్కువగా వెలుతుంటారు. ఈ మార్గంలో మరిన్ని ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులపై దృష్టిసారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



రాయితీ విత్తనాలను అందిస్తున్న దృశ్యం

రాయితీ విత్తనాలు వినియోగించుకోండి

ముంచంగిపుట్టు, జూన్ 7: రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి కోరారు. రైతుభరోసా కేంద్రం ఆవరణలో శుక్రవారం రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రం వద్ద శ్రీకాకుళం సన్నాలు, శ్రీధృతి, ఇంద్ర, అమర తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయిని చెప్పారు. రాయితీ అందించనున్న ఈ విత్తనాలను అవసరమైన రైతులు వచ్చి తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే సాగులో చిన్నపాటి మెలుకవలు పాటిస్తే అధిక శాతం దిగుబడి సాధించవచ్చని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను రైతులు విధిగా పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్న, హార్టికల్చర్ అసిస్టెంట్ చందు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలకు వేతనం రూ.600 ఇవ్వాలి'

పరవాడ, జూన్ 7: ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన భరిణికం చెరువు వద్ద పనిచేస్తున్న కూలీలతో సమావేశమై మాట్లాడారు. ప్రతి కూలీ కుటుంబానికి ప్రభుత్వం 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఉపాధి కూలీలు లక్ష్మి, దేముడమ్మ పాల్గొన్నారు.

పనులు కల్పించాలని కూలీల ఆందోళన

అచ్యుతాపురం, జూన్ 7: ఉపాధి హామీ పనులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం పెదపాడు పంచాయతీ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంచాయతీ పరిధిలో వారం నుంచి ఉపాధి హామీ పనులు నిలిపి వేశారన్నారు. మండు వేసవిలో పనులు చేయించి, వర్షాలు పడుతున్న సమయంలో ఆపి వేయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సముద్రాలు, లక్ష్మి, అప్పలనర్సమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మోదకొండమ్మ మాలధారణ



మోదకొండమ్మ అమ్మవారి మాల ధరించిన భక్తులు

మాడుగుల, జూన్ 7 : ఉత్తరాంధ్ర జిల్లాల్లో పేరెన్నికగన్న మాడుగుల మోద కొండమ్మ జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుతున్నాయి. ఈ వేడుక సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి మాలను ధరిస్తున్నారు. శుక్రవారం బయలుపూడి, బోయ పాడు, జైతవరం, వీరవిల్లి, జాలంపల్లి, అర్జాపురం, విశాఖ వంటి పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేశారు. తొలుత అర్చకులు పుల్లేటికుర్తి శ్రీనివాస్ అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులతో మాలధారణ చేయించారు.

☛ సంక్షిప్తంగా..

రక్తదానానికి ముందుకు రావాలి

సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి



పాడేరు రూరల్, జూన్ 7: జిల్లా కేంద్రం పాడేరులో రక్తదానం చేయాలన్న ఆసక్తి గల ప్రజలు ముందుకు రావాలని సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అత్యవసర సమయంలో రక్తం లభించక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 9, 10, 11వ తేదీలలో జరగనున్న మోదకొండమ్మ ఉత్సవాల సమయంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9440933450 నంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, జూన్ 7: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని ఆయన ప్రకటించారు. ఈ నెల 12వ తేదీ వరకు పాడేరు, చింతపల్లి, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా రెండు మిల్లీమీటర్ల నుంచి గరిష్ఠంగా పది మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. రైతులు తొలకరి వర్షాలను వినియోగించుకుంటూ ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని చెప్పారు.

జగన్ మైకం నుంచి బయటకు రండి

» టీఎన్ఎస్ఎఫ్ మండల కార్యదర్శి కల్యాణి

గూడెంకొత్తవీధి, జూన్ 7: ఆదివాసీలు జగన్ మైకం నుంచి బయటకు రావాలని టీఎన్ఎస్ఎఫ్ మండల కార్యదర్శి ముక్కలి కల్యాణి సూచించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం సంతోషంగా ఉన్నప్పటికీ, పాడేరు, అరకు నియోజకవర్గాల్లో ఓడిపోవడం బాధ కలిగిస్తుందన్నారు. చంద్రబాబు గిరిజనుల పక్షపాతియని, ఆదివాసీల కోసం ప్రత్యేక పథకాలు పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కరే అన్నారు. బాక్సైట్ తవ్వకాలను నిలుపుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రత్యేక డీఎస్సీని మొట్టమొదట ప్రవేశపెట్టింది, జీవో నంబరు-3 అమలులోకి తీసుకొచ్చింది చంద్రబాబుదే అన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించపోయినా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆయన పెద్దపీట వేస్తారని చెప్పడంలో సందేహం లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి మోసాలను గుర్తించి గిరిజనులు చైతన్యంతో మెలగాలని ఆమె సూచించారు.

జర్రెల ఘాట్‌లో వాహనాల రాకపోకలకు బ్రేక్

గూడెంకొత్తవీధి, జూన్ 7: చింతపల్లి-జర్రెల ప్రధాన రహదారి ఘాట్‌లో తారు రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున రెండు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు జర్రెల, మొండిగెడ్డ సర్పంచులు నాగరాజు, అడప ప్రియాంక తెలిపారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్రెల ఘాట్‌లో తారు రోడ్డు నిర్మాణం ప్రారంభించారన్నారు. ఈ మేరకు వాహనాలను ఆదివారం వరకు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వాహన చోదకులు ఈ విషయాన్ని గమనించి తమకు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.

డిగ్రీ పరీక్షా ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

అరకులోయ, జూన్ 7: ఆంధ్రా యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, పట్నాసి చలపతిరావు తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో చిప్పాడ జ్యోతి కళాశాల టాపర్‌గా నిలిచినట్టు చెప్పారు. అలాగే బీకాం జనరల్ కోర్సులో రేగం ప్రవీణ ప్రథమ స్థానం సాధించగా, సీసా షర్మిల ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.అన్నపూర్ణ, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డుంబ్రిగుడ, జూన్ 7: కించుమండ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించన్నుట్టు ప్రధానోపాధ్యాయుడు గెన్ను తెలిపారు. పాఠశాలలో వసతితో కూడిన విద్యను అందిస్తామని చెప్పారు మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మూడో తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే నాలుగో తరగతిలో 40, ఐదులో 37, ఆరులో 24, ఏడులో పది, ఎనిమిదిలో పది, తొమ్మిదిలో పది సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల పనివేళలో సంప్రదించాలని అయన కోరారు.

పాలిహౌస్‌పై నిర్లక్ష్యపు నీడ!

... 5వ పేజీ తరువాయి

అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పాలిహౌస్ మరమ్మతులకు సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల నిధులు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. అయితే గతంతో పోల్చుకుంటే ఐటీడీఏలో నిధుల కొరత అధికంగా ఉన్నది. దీని వల్ల పాలిహౌస్ కోసం నిధులు వెచ్చించేందుకు ఐటీడీఏ అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. గిరిజన వైసీపీ ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంతో పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. గిరిజన రైతుల ఆర్థిక ప్రగతికి బాసటగా నిలిచే మిరియాల మొక్కల ఉత్పత్తి పాలిహౌస్‌పై అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రానున్న రోజుల్లో గిరిజన రైతులకు మేలి రకం మొక్కలు అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి పాలిహౌస్‌కు మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత గిరిజన రైతులు, హెచ్ఎన్‌టీసీ ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు.